# వీర తెలంగాణా సాయుధ పోరులో రాలిన బాలింల రత్నాలు

బాంచన్ నీ కాల్మొక్తా ... అంటూ దొరలకు  బానిసలుగా బ్రతికిన తెలంగాణా బిడ్డలు కత్తులు చీల్చుకు పోయినా నెత్తుటేరుల పారిన ఎత్తిన జెండా దించకోయ్ అరుణ పతాకకు జై ... జై ... అంటూ దొరల పెత్తనాలపై నైజాం నిరంకుశ పరిపాలనపై సాయుధంగా తిరుగుబాటు చేసి తెలంగాణాను వెట్టి నుండి విముక్తం చేసిన వీరోచిత విజయ గాధ తెలంగాణా సాయుధ పోరాటం.

భారతదేశానికి స్వాతంత్ర్యము రాకముందు దేశములోని సగానికి పైగా ప్రాంతాన్ని బ్రిటీష్‌వారు పరిపాలించేవారు. మిగిలిన సగభాగములో 562 స్వదేశీ సంస్థానములు ఉండేవి. అది హైదరాబాద్ రాష్ట్రం. దేశములోని 562 సంస్థానాలలో అతిపెద్దది. ఆసఫ్‌జాహీ వంశీయుడు ఉస్మాన్ అలీఖాన్ ఏలుతున్నాడు. సర్వస్వతంత్రుడు, సర్వసంపన్నుడు, బ్రిటీషు సామ్రాజ్యవాదుల అనుంగు మిత్రుడతను.

మధ్యయుగాల నాటి నిరంకుశ రాజ్యం నిజాం సంస్థానం. ఈ సంస్థానంలో జమిందారీ, జాగీర్దారీ రాజరిక వ్యవస్థ దోపిడి పీడనల క్రింద ప్రజలు తరతరాలుగా సలిపివేయబడుతూ వచ్చారు. బయటి ప్రపంచముతో ఎలాంటి సంబంధం లేకుండా బందీల్లా ఏ ప్రాథమిక హక్కులు లేకుండా ఇనుప పాదాల క్రింద ప్రజలు అణచిపెట్టబడ్డారు. ఎనిమిది జిల్లాల తెలుగు ప్రజలు (నేటి 9 జిల్లాలు) 5 జిల్లాలు మహారాష్ట్ర 3 జిల్లాలు కర్ణాటక ప్రాంతాలతో కలిసి ఉండేది నిజాం సంస్థానం. ఆ సంస్థానంలో సర్వత్రా ప్రజలలో దోపిడి పీడనకు వ్యతిరేకంగా అసంతృప్తి ఉవ్వెత్తున ఎగిసిపడుతున్న రోజులివి.

దేశ్‌ముఖ్‌లు, దేశపాండేలు, దొరలు, జమీందార్లు, పట్వార్లు, పటేల్లు సాగించే దోపిడి, దౌర్జన్యాలకు అంతులేదు. వారంతా నైజాం నవాబు ముద్దు బిడ్డలు. వారు చెప్పిందేన్యాయం, వారు పలికిందే వేదం, వారికెదురులేరు, తిరుగులేదు. కమ్మరి, కుమ్మరి, చాకలి, మంగలి ఒక్కరేమిటి? 12 కులాల వాళ్ళు వారివారి వృత్తుల ప్రకారం ఊడిగంచేయాలి. ఉదా॥చాకలి వారు బట్టలు ఉతకాలి, మంగలి వారు సగరాలు, గడ్డాలు చేయాలి. కట్టెలు కొట్టాలి, కల్లు తేవాలి, కాళ్ళువత్తాలి, మేనల్లో దొరసాన్లను మోసుకెళ్ళాలి, వెట్టిచెయ్యాలి, కోళ్ళు, గొర్రెలనియ్యాలి, నాట్లు

వెయ్యాలి, కుండలియ్యాలి, కుర్చీలు వెయ్యాలి, వాకిలూడ్వాలి, పక్కవేయాలి, దీపాలు పెట్టాలి, దివిటీలు పట్టాలి, వంటచేయాలి, భూమి దున్నాలి, కచడాల ముందు ఉరకాలి, పచ్చి బాలింతరాండ్లు సహితం పాలు పిండి చూపితే తప్ప స్త్రీలను పనుల నుండి వదిలేవారు కాదు. ఒక్కటేమిటి ప్రజల మాన ప్రాణాలపై పెత్తనం వాళ్లదే. వెట్టిచెయ్యక పోయినా, మామూళ్లు ఇవ్వకపోయినా వాళ్లకెదురుగా తలెత్తుకొని నిలబడినా నేరమే. జర్మానాలు వేస్తారు, ఖాదులో తోస్తారు. దూడ, మేక వుంటే గుంజుకుంటారు. వెట్టి చేయించుకోవడం వాళ్ల హక్కుగా వుంది.

నాటి తెలంగాణా ప్రజలు తమ రక్తాన్ని చెమటగా మార్చి ఆరుగాలం కష్టపడి దొరలగాదెలను నింపిన తెలంగాణా ప్రజలు మిత్తీలు, నాగు, నజరానా, దండుగా లాంటి పన్నులతో వెట్టిచాకిరి ఊడిగాలతో బానిసలుగా మార్చి కాల్చుకుతిన్న పెత్తందారి భూస్వాముల మీద, తవ్వా, దౌరాల, తక్తా, ఖుచ్‌లెవీలాంటి పన్నులమోత జరిమానాల పోటులతో జనాన్ని దోచుకుతిన్న నిజాం అధికారుల ఆకృత్యాలకు వ్యతిరేకంగా భూమికోసం ... భుక్తికోసం పేద ప్రజల విముక్తికోసం చికరికి చెల్లాచెదురుగా వున్న తెలుగు ప్రజలందరినీ ఒకే పాలన క్రిందకు తీసుకోని రాగలిగిన విశాలాంధ్ర సాధనకోసం కమ్యూనిష్టుల నాయకత్వంలో ఆవిర్భవించిన తెలంగాణా సాయుధపోరాటం. అనతి కాలములోనే ప్రజా ఉద్యమంగా రూపుదిద్దుకొని ఊరూర, వాడవాడనా వెట్టిని తుదముట్టించడానికి పోరాటాలు ఉదృతమయ్యాయి. ఉద్యమాన్ని అణచివేయడానికి, కమ్యూనిస్టులను అంతమొందించటానికి నిజాం ప్రభుత్వం అనేక రాక్షసకృత్యాలకు పాల్పడింది. కన్పించిన వాళ్లను కనిపించినట్లె కాల్చి చంపడం మొదలుపెట్టింది. ఈ పోరాటంలో ఎందరో ఉద్యమనేతలు అశువులుబాశారు. పోరాటాలగడ్డ బాలెంల 10 మంది ప్రజానాయకులను కోల్పోయింది.

## బాలెంల

నల్లగొండ జిల్లా సూర్యాపేట తాలూకాలో సూర్యాపేటకు సమీపంలో గల బాలెంల గ్రామ ప్రజలు వీర తెలంగాణా సాయుధ పోరాటంలో చురుకుగా పాల్గొన్నారు. గ్రామానికి చెందిన పోలీసు పటేల్ రామసాని చెన్నయ్య గారి తమ్ముడు రామసాని రామకృష్ణయ్య మరియు మాలి పటేల్ గార్లపాటి వెంకటరెడ్డి గారి తమ్ముడు గార్లపాటి అనంతరెడ్డి పోరాటంలో పాల్గొన్నందున

యువకులకు పోరాటముపట్ల మరింత ఉత్సాహం పెరిగి వీరంతా చురుకుగా పాల్గొన్నారు. పుచ్చలపల్లి సుందరయ్య, భీమిరెడ్డి నర్సింహారెడ్డి, తిరుమలరావు మొదలయిన కమ్యూనిస్ట్ నాయకుల అడుగు జాడలలో నడుస్తూ గ్రామ ప్రజలు వీరోచితముగా పోరాటంలో పాల్గొన్నారు. ఈ గ్రామ ప్రజలపై మిత్తీలు, నాగు, నజరానా, దండుగా, తవ్వా, దౌరాల, తక్తా, ఖుష్‌లేవిలాంటి పన్నులమోత జరిమానాల పోటీలధికంగా ఉండేవి. పన్నులు, రకాల వసూళ్ళకై వచ్చే నిజాం ప్రభుత్వ ఉద్యోగులు, రజాకారులు గ్రామ ప్రజలపై దౌర్జాన్యాలు కొనసాగించేవారు. వెట్టిచాకిరి చేయించుకునేవారు. వీరి హింసలను భరించలేని గ్రామ ప్రజలు పోరు బాటలో నడిచారు. వెట్టి చాకిరితో ప్రజలను వేధించే భూస్వాములు, రజాకారులను ప్రతిఘటించిన సాయుధ దళాలలోను మరియు ప్రజలకు జాగృతం చేసిన సాంస్కృతిక, వైజ్ఞానికి దళాలలోను సభ్యులుగా పనిచేయుట గాక నాయకులకు ఆశ్రయం కల్పిస్తూ సద్దులు కూడా మోసారు. గ్రామానికి చెందిన పోలీస్ పటేల్ రామసాని చెన్నయ్య గారి తమ్ముడు రామసాని రామకృష్ణయ్య కమ్యూనిస్టు పార్టీలో కీలక సభ్యులు. ఈయన 12 గ్రామాలకు పార్టీ ఆర్గనైజర్‌గా పనిచేశాడు. ఇతడిని నిర్బదించాలని ప్రభుత్వం అనేక పర్యాయములు ప్రయత్నించింది.

బాలెంల గ్రామంలో దైర్జాన్యాపరులైన భూస్వాములు ఎవరూలేరు. కాని ఆ గ్రామ పార్టీ, ఆంధ్ర మహాసభ కార్యకలాపాలకు కేంద్రమై చుట్టుపట్ల గ్రామాలకు అండదండగా ఉండేది. సూర్యాపేట సమీపాన రోడ్డుపైన ఉండుట వలన పార్టీ కార్యకర్తలు ఈ గ్రామంలో రహస్యంగా వుంటూ సూర్యాపేట పట్టణంలో కూడా రహస్యంగా తమ కార్యకలాపాలు సాగించేవారు. తాలూకాలోని లోతట్టు గ్రామాలకు వెళ్ళటానికి ఈ గ్రామం ముఖ్య కేంద్రం కూడా.

**మిలిటరీ కాల్పులు మట్టారెడ్డి, అనంతరెడ్డి మరణం :** గ్రామంలో ఆంధ్రమహాసభ కమ్యూనిస్టు పార్టీ నాయకులు ఆశ్రయంను పొందివున్నారన్న సమాచారం ప్రభుత్వానికి తెలిసింది. ఆశ్రయం పొందియున్న పార్టీనాయకులను అలాగే గ్రామానికి చెందిన రామసాని రామకృష్ణయ్య ను నిర్భందించుటకై ప్రభుత్వం 1946 సంవత్సరం అక్టోబర్ 25 తేది శుక్రవారం నాడు గ్రామముపైకి రిజర్వు దళాలను పంపింది. దాదాపు 100 మంది పోలీసులు గ్రామానికి వచ్చారు. గ్రామం చుట్టూ పహారాకాసి గ్రామంలోని ప్రజలు బయటకు పోకుండా గ్రామాన్ని దిగ్భందం చేసారు. సుమారు 30 మంది పోలీసులు గ్రామంలోనికి పోయి పొలాలకు కాల కృత్యమలు తీర్చుకొనుటకై వచ్చిన ప్రజలపై, సోదాల పేరుతో ఇండ్లలోకి జొరబడి స్త్రీ ,

పురుషులపై దెబ్బల వర్షం కురిపించారు. ఒక్క క్షణంలో రాక్షసత్వాన్ని నగ్నంగా ప్రదర్శించారు.

సుమారు 10 మంది పోలీసులు గ్రామ పోలీస్ పటేల్ అయిన రామసాని చెన్నయ్య ఇంటికి పోయి అతడి తమ్ముడు రామకృష్ణయ్య జాడను అడిగిరి. తనకు తెలియదని అతడు చెప్పిన సమాధానంతో సంతృప్తి చెందని పోలీసులు అతడిని లాఠీలతో కొట్టిరి. తనకు దొరికిన కట్టెతో చెన్నయ్య పోలీసులపైకి ఎదురు తిరిగెను. పోలీసులు ఆ ఇంటిని విడచి పోయిరి.

ఆ తరువాత వీరు కామ్రేడ్ పటేల్ మట్టారెడ్డి ఇంటిని చుట్టుముట్టారు. ఆ ఇంట్లో ప్రవేశించడానికి ప్రయత్నించారు. పోలీసుల రాకను గమనించిన మీదట, కామ్రేడ్ మట్టారెడ్డి నిద్ర మేల్కొన్నాడు. కర్రచేత బట్టుకున్నాడు. వాళ్ళను లోపలకు అడుగు పెట్టకుండా అడ్డుకున్నాడు. పోలీసులోచ్చారని హెచ్చరిక చేస్తూ కేకలు వేశాడు. ఆయన కేకలు విన్నమీదట, ఇరుగుపొరుగు వాళ్లు కర్రలు చేతబట్టుకుని, నినాదాలు చేసుకుంటూ ఆయన ఇంటికి పరుగెత్తుకొచ్చారు. ఒక సబ్ఇన్స్పెక్టరు చెయ్యి విరగ్గొట్టారు. అనేక మంది కానిస్టేబుళ్ళ తలలు పగలగొట్టారు. వాళ్ళ చేతుల్లోని రెండు రైఫిల్లను కూడా విరగొట్టారు. దీనితో సర్కిల్ ఇన్స్పెక్టర్ రెచ్చిపోయాడు. తుపాకీ తీసుకొని ముందుకొస్తున్న మట్టారెడ్డి పైనా గార్లపాటి అనంతరెడ్డి తదితరులపైన గురిపెట్టి కాల్పులు జరిపాడు. మొదటి గుండు గార్లపాటి అనంతా రెడ్డి గుండెను చీల్చివేసింది. అనంత రెడ్డి అంతటితో ఆగలేదు. ప్రజలు తనపైనిడిన భాద్యతను తుది క్షణందాకా నిర్వహించాలని పడిపోయినవాడు లేచి కర్ర నెత్తాడు. సర్కిల్ వెంట వెంటనే కాల్చగా టపాకాయలు ఉన్నట్లున్నాయే అని నేలకొరిగాడు. ఆతరువాత పటేల్ మట్టారెడ్డి తలలోను, పొట్టలోను తూటాలు దూసుకు పోయాయి. సంఘం కి జై .. అంటూ నినాదిస్తూ ఆయన అశువులు వీడాడు. మరో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. వారు సుంకు రంగయ్య, చాకలి బిక్షం మరియు జమాల్ సాహెబ్ ప్రజల మృతదేహాలను తీసుకుపోయేసరికి పోలీసులు వారిని తమ వ్యానులో వేసుకొని వెళ్లిపోయారు. వేగంగా పోతున్న వ్యానును అటకాయించడానికి ప్రజలు ప్రయత్నించారు. కాని ఆపలేక పోయారు. తమ నాయకులు మృతి చెందినందుకు మరికొందరు గాయపడినందుకు తమ హృదయాలలో దు:ఖం వెల్లుబికి వస్తున్న ప్రజలు శత్రువు తమ చేతిల్లోనుండి తప్పించుకుపోయినందువల్ల ఆగ్రహావేశులు అయ్యారు. శత్రుదాడిని ఎదురుకొనుట కోసం వారు కర్రలు, వడిసలు చేతబూని

కాపలకాసారు. ప్రజల ధైర్యసాహసాలను చవిచూసిన పోలీసులు గ్రామంలో యింకే ఇతర ఇంటి పైనా దాడి చేయడానికి సాహసించలేక పోయారు. ఆగ్రామంలోని మిగతాపార్టీ నాయకులు కాపాడ పడ్డారు.

తెల్లవారే గ్రామ ప్రజలంతా సూర్యాపేటకు చేరుకున్నారు. శవపరీక్ష అనంతరం మృత దేహాలను తీసుకున్నారు. ఊరేగింపుతో తమ గ్రామానికి తీసుకెళ్ళి దహన సంస్కారాలు చేసారు. పది గ్రామాల ప్రజలు వేలాదిగా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రజల ఆగ్రహం మరింత అధికమైంది. ఆ సంఘటన అనంతరం నాయకులు ప్రజల కిచ్చిన విప్లవ సందేశం తన భర్త మరణానికి ప్రతీకారం తీర్చుకుంటానని మట్టారెడ్డి భార్య ప్రతిన బూనటం ప్రజలను ఎంతగానో ఉత్తేజ పరిచాయి. వారిలో నూతనోద్వేగం పూరించాయి. తామంతా అమర వీరులు ప్రారంభించిన కృషిని కొన సాగిస్తామని నైజాం, జమిందార్‌లు, పోలీసులు సాగిస్తున్న నిర్భందకాండను రూపుమాపుతామని శ్మశాన వాటిక వద్ద వారంతా ప్రతిన బూనారు.

**పార్టీ సందేశం:** సంఘటన తరువాత ఆంధ్రమహాసభ పార్టీ కార్యకర్తలకు ఒక సందేశం వచ్చింది. మిలటిరీ వారు ఎప్పుడైనా గ్రామంపై మరల దాడీ చేసే అవకాశం ఉన్నందున కార్యకర్తలు ఎవ్వరూ గ్రామంలో రాత్రి సమయాలందు వుండవద్దు అని కొండలలో, కోనలలో దాచుకొని తమ ప్రాణాలు రక్షించుకోవలెనని పగటి పూటనే తమ కార్యక్రమాలను పూర్తిచేసుకోవలెనని ప్రజలలో భయాందోలనను తొలగించుటకై వారికి ధైర్యం చెప్పవలెనని పిలుపు వచ్చింది.

**యువరాజు పర్యటన:** కాల్పులు పూర్తికాగానే మీర్జా ఇస్మాయిల్ ఒక ఎత్తు వేశాడు. నిజాం నవాబు కొడుకును కాల్పులు జరిగిన గ్రామాల్లో పర్యటన చేయించి ప్రజలను పరమార్శించి చనిపోయిన వారి కుటుంబాలకు కొంత డబ్బు దానం చేయించి ప్రజలను బుజ్జగించే ప్రయత్నం చేసారు. ఈరోజుల్లో ప్రజలపై కాల్పులు చేసి ఎక్స్‌గ్రేషియా పేరుతో కొంత డబ్బును ప్రజల మొహాన పడేసి ప్రజలు ఆందోళనకు పూనుకోకుండా ప్రభుత్వం చేసే ప్రయత్నం కొత్తగా కనిపెట్టిందేం కాదు. ఆనాడు హైదరాబాద్ ప్రధాన మంత్రిగా వున్న మీర్జా ఇస్మాయిల్ దాన్ని అమల్లోకి తెచ్చాడు.

యువరాజు పర్యటన ప్రారంభం లోనే సూర్యాపేటలో మకాంవేసినాడు. ఏర్పాటు చేసిన

కార్యక్రమం ప్రకారం యువరాజు ముందు సమీపాన వున్న బాలెంల గ్రామానికి వెళ్లి కాల్పుల్లో చనిపోయిన వారి భార్యలకు ఒక్కొక్క రూపాయల మూటను ఇవ్వడానికి ఏర్పాట్లు చేసారు. ఆరోజుల్లో కరెన్సీ నోట్ల చలామని తక్కువ. కరెన్సి నోట్ల కన్న రూపాయల మూట ప్రజలను ఆకర్శిస్తుంది. ప్రచారానికి తోడ్పడుతుంది. సుమారు రూ.500 పట్టు గుడ్డలో మూట కట్టి ఆమూటను నిరాకరించాలని యువరాజు వచ్చినప్పుడు నిరసన ప్రదర్శన చేయాలని పార్టీ, ఆంధ్రమహాసభ జిల్లా కమిటీలు కార్యక్రమాన్ని అమలు పరచడానికి వారు దీనికి అంగీకరించారు. డబ్బు నిరాకరించడానికి సిద్దమైనారు. ప్రభుత్వానికి ఈసమాచారం అందింది. పర్యటనను రద్దుచేసుకోవాలని యువరాజు నిర్ణయించుకొనినారు. కాని బాలెంల గ్రామం సందర్శించినాడు.

గ్రామానికి యువరాజు రాక సందర్భంగా ప్రభుత్వ అనుకూల వర్గీయులు స్వాగతం చెప్పగా ఆంధ్రమహాసభ కమ్యూనిస్టు పార్టీ యువరాజు రాకను నిరసించింది. మాలి పటేల్ మొదలగు ప్రభుత్వ ఉద్యోగులు కట్టుదిట్టమైన ఏర్పాట్లను చేసారు.

మొదట మిలిట్రీ కాల్పులలో గ్రామంలో మరణించిన మృత వీరుల భార్యలకు యువరాజు మూడు దోసిల్ల చొప్పున రూపాయ బిల్లలను పోసాడు. మరికొన్ని డబ్బులను వీధులలో చల్లుతూ పోయాడు. తనకు మంగళ హారతి పట్టిన బ్రాహ్మణులకు కూడా డబ్బులను సజరానాగా ఇచ్చాడు.

ఈరాక సంధర్భంగానే అప్పటి వరకు ఆంధ్ర మహాసభ కమ్యూనిస్ట్ పార్టీలలో కీలకంగా పనిచేసిన శ్రీ రామసాని రామకృష్ణయ్యను నిర్బందించవలెనని అతని గృహంను కాల్చివేయవలెనని అనుకొనిసాడు. అతడి గుడిసెను చూసి కాల్చితే బుక్కెడు బూడిద కాని గుడిసెను చూసి తన నిర్ణయంను మార్చుకొనినాడు. ఆ తరువాత గ్రామంలో ఏర్పాటు చేయబడిన ప్రధాన కార్యక్రమంనకు వెళ్లాను. అచ్చట గదిలోకి ప్రవేశించుచుండగా యువరాజు కిరీటంపై గల తూరాయి ద్వారా గుమ్మంనకు తగిలి క్రిందపడెను. దీనిని అపశకినంగా భావించిన యువరాజు కార్యక్రమంలో పాల్గొనకుండా అక్కడి నుండే వెనుతిరిగిపోయెను.

**బాలెంల గ్రామాన్ని సందర్శించిన ఇతర ప్రముఖులు:** యువరాజు పర్యటించిన తరువాత సోవియట్ రష్యా దేశానికి చెందిన ప్రఖ్యాత కమ్యూనిస్టు నాయకుడు రచయిత

అయిన ఓల్గా నాయకత్వంలో సోవియట్ రష్యా, చైనా, ఫ్రెంచ్ , డెన్మార్క్ మరియు హంగేరి మొదలైన ఐదు దేశాలకు చెందిన 30 మంది సభ్యులతో కూడిన ప్రపంచ యువజన సమితి బాలెంల గ్రామాన్ని సందర్శిచినది. కాల్పులలో మరణించిన కుటుంబాలను పరామర్శించి తమ ప్రగాఢ సానుభూతి తెలిపినది. భూమికోసం, భుక్తికోసం పీడిత ప్రజల విముక్తి కోసం ప్రజలు సాగిస్తున్న పోరాటంను ప్రశంసిచింది.

వీరేకాక అఖిల భారత కాంగ్రేస్ కమిటి అధ్యక్షులు శ్రీద్వారకానాథ్ కచరు, హైదరాబాద్ స్టేట్ కాంగ్రేస్ కమిటీ అధ్యక్షులు శ్రీ స్వామి రామానంద తీర్థ మరియు రచయిత పత్రిక సంపాదకులు మందుముల నర్సింగ రావు మొదలైన వారు గ్రామాన్ని సందర్శించారు.

యువరాజు పర్యటన తర్వాత కూడా, నిజాం మిలటరీ తమ దృష్టిని బాలెంల గ్రామంపై నుండి మరల్చలేదు. తరచుగా గ్రామం పైకి దాడీ చేస్తూ ప్రజలను శారీరకంగా, మానసికంగా హింసిస్తూ ఆర్థికంగా కూడ కొల్లకొడుతూ వారిధనాన్ని, ధాన్యాన్ని దోచుకొనేవారు. గ్రామంలో పార్టీనాయకులుగా అనుమానించిన ప్రతి వ్యక్తిని కౄరముగా హింసించేవారు. పార్టీనాయకుల జాడ చెప్పగలరని భావించిన వ్యక్తులను కూడా వదిలేవారు కాదు.

బాలెంల గ్రామానికి చెందిన వ్యక్తులు మరే ఇతర గ్రామాలలో కనిపించినచో వారిని గుర్తించి నిర్భందించి క్రూరముగా హింసిండమో, కాల్చివేయడమో చేసేవారు. ఉదాహరణకు గుడిపాటి సారయ్య అనే షావుకారు సరుకులు తెచ్చుకొనుటకై సూర్యాపేటకు వెళ్ళిన సందర్భంలో అతనిని బాలెంల గ్రామానికి చెందిన కమ్యూనిష్ట్ నాయకుని గుర్తించి నిర్భందించిరి. పోలీసుల నిర్భందము నుండి తప్పించుకొనుటకై కామ్రేడ్ సూరయ్య ప్రయత్నించగా పోలీసులు కాల్చివేశారు. పటేల్ అనంతరెడ్డి అనే ఒక రైతు తన ధాన్యాన్ని సూర్యాపేట మార్కెట్‌కు తీసుకొనిపోయిన సందర్బంలో అతడని కూడా నిర్బందించి పార్టీ నాయకులు జాడ చెప్పమంటు హింసించిరి. నాలుగురోజుల తర్వాత అతడిని జమానత్‌పై విడిచిపెట్టిరి.

**రెండవ దఫా దాడి:-** సర్వజిత్తు నామ సంవత్సర జేష్ఠమాసము 1947 సంవత్సరం జూన్ రెండవ వారంలో నిజాం మిలటరీ రెండవసారిదాడి జరిపినది. ఈ దాడిలో సుమారు 100 మంది పోలీసులు పాల్గొన్నారు. ఈ దాడిలో కామ్రేడ్ గండమాల ఎల్లయ్యా, కామ్రేడ్

మేకల ముత్తయ్య, కామ్రేడ్ కన్నెబోయిన మల్లయ్య మరియు కామ్రేడ్ పటేల్ లింగారెడ్డిలను పట్టుకొనిపోతున్న సందర్భములో గ్రామంలోని ప్రజలంతా ఒక్కటై తమ నాయకులను రక్షించుకొనుటకొరకు తమకు అందుబాటులో ఉన్న ఆయుధాలతో పోలీసులు తమ వ్యానులో ఎక్కించుకొని తీసుకుపోయి పెన్‌పహడ్ గుట్టలలో కాల్చి చంపారు.

**మూడవ దఫా దాడి:–** కాసీం రజ్వీ నాయకత్వంలోని ఇత్తేహాదుల్ ముసల్మాన్ అనే సంస్థకు చెందిన రజాకారులు సామాన్య పౌరుల వలె గ్రామంలో ప్రవేశించి రహస్యంగా పార్టీ నాయకుల కార్యక్రమాలను, వారి స్థావరాలను ఎప్పటికప్పుడు ఏనుబాముల వద్ద గల రజాకార్ల క్యాంపుకు తెలియపర్చేవారు. వీరంధించిన రహస్య సమాచారాలను తెలుసుకొని, గాఢ నిద్రలో ఉన్న గ్రామ ప్రజలపై 1948 ఫిబ్రవరి రెండవ వారంలో ఉదయం 4 గంటల సమయంలో మెరుపుదాడి జరిపారు. ఈ దాడిలో సుమారు 200 మంది రజాకార్లు పాల్గొన్నారు. ఈ విషయం తెలియని యువకుల రోజువారి కార్యక్రమాలకు ఇంటి నుండి బయటకు వస్తున్న వారిని రజాకారులు నిర్భందించి గ్రామ నడిబొడ్డు దగ్గరకు తీసుకొని పోయి ఇద్దరు యువకులను రేగు కంపపై పండబెట్టి పార్టీ నాయకుల జాడ చెప్పమంటూ లాఠీలతో కొట్టిరి. ఈ దాడీలో కామ్రేడ్ గవ్వా రాంరెడ్డి, కామ్రేడ్ ఎద్దు గోపయ్య, కామ్రేడ్ కటికం పిచ్చయ్యలను పట్టుకొని పోయి ఏనుబాముల క్యాంపు వద్ద అతి క్రూరంగా కత్తులతో పొడిచి చంపారు.

**సాంస్కృతిక దళం:** ప్రజలను ఏ విషయం పైనైనా ప్రతిస్పందింపచేసేవి సాంస్కృతిక జానపద కళారూపాలే. పెత్తందారి భూస్వాములు అనుసరిస్తూన్న విధానాలకు నిజాం అధికారుల ఆకృత్యాలకు వ్యతిరేకంగా భూమి కోసం, భుక్తి కోసం, పీడిత ప్రజల విముక్తి కోసం ఒక ప్రక్క సాయుధ పోరు జరుగుతుంటే చంద్రునికో నూలు పోగు అన్నట్టు సాంస్కృతిక దళాలు ప్రజల యొక్క గాధలను కళారూపాలుగా మలచి కథలు, నాటికలు, పాటలు, బుర్రకథలు, గొళ్ళసుద్దులు, జేంబుకల కథలు ఇతర జానపద కళారూపాల ద్వారా ప్రదర్శించి సాయుధ పోరు పట్ల ప్రజలను కార్యోన్ముఖులను చేసినది.

ఇలాంటి దళాలు బాలెంల గ్రామానికి చెందిన వైజ్ఞానిక దళం ఒకటి కలదు. ఈ దళంలో మట్టపల్లి మల్లయ్య, మట్టపల్లి వెంకన్న, లవణం పిచ్చయ్య, త్రాసు శ్రీశైలాచారి, ఆకుల వెంకన్న, వారాల శ్రీహరి, లక్ష్మణాచారి మొదలగు వారు సభ్యులు.